క్లుప్తంగా

డంపింగ్ యార్డును ప్రక్షాళన చేస్తాం



గుడివాడ టౌన్: స్థానిక పురపాలక సంఘానికి చెందిన డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. డంపింగ్ యార్డు నుంచి తరుచూ పొగ వెలువడటం తద్వారా స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారని, దీనిని ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా మంటలు చెలరేగినప్పుడు నీటిని వెదజల్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వర్షాకాలం వాహనాల రాకపోకలకు కావలసిన ఏర్పాట్లు సైతం మెరుగు పరుస్తున్నామని తెలిపారు.

సబ్సిడీపై అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

పామర్రు: భూమిలోని సారాన్ని మరింతగా పెంపొందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు ఉపయుక్తం అవుతాయని పామర్రు ఏవో శివ నాగరాణి సోమవారం తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని అన్నారు. జీలుగ విత్తనాలు కేజీ రూ.39.50, పిల్లి పెసర కేజీ రూ.48.50, జనుము కేజీ రూ.42–00 వంతున ధరకు రైతులు తీసుకోవచ్చన్నారు. ఆర్‌బీకేలలో ఉన్నాయని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, ఫోన్‌ను తీసుకువెళ్లి ఆర్‌బీకేల వద్ద ఉన్న వీఏఏలను సంప్రదించి పచ్చిరొట్ల విత్తనాలను రాయితీపై తీసుకోవాలని తెలియజేశారు. పచ్చిరొట్టవిత్తనాల వాడకం వలన భూమి సారంపెరుగుతుందని అంతే కాకుండా ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. చౌడు భూముల్లో సాగు వలన చౌడు పోయి భూసారం పెరుగుతుందని తెలిపారు.

సచివాలయాల పనితీరు భేష్



గుడివాడ టౌన్: గుడివాడ పట్టణ పరిధిలో సచివాలయాల పనితీరు సంతృప్తికరంగా ఉందని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు డాక్టర్ లక్ష్మీశా అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో 19, 20 వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, వివరాలు, వివిధ పథకాల నిర్వాహణలో సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఉద్యోగులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సచివాలయ పరిధిలో లబ్ధిదారుల వివరాలు, వివిధ పథకాలకు సంబంధించిన పోస్టర్ల వివరాలు సంతృప్తిని ఇచ్చాయన్నారు. అనంతరం మల్లాయిపాలెం లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులను చూశారు. నిర్మాణ పనులు మరింత వేగవంతం చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, హౌసింగ్ డీఈ రామోజీ నాయక్, ఏఈ సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మండవల్లి: మండవల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మల్లీశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ (రాము) అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఫిషింగ్ హార్బర్ పనుల పరిశీలన



మచిలీపట్నంటౌన్: నగర శివారు గిలకలదిండి సముద్రతీరాన జరుగుతున్న ఫిషింగ్ హార్బర్ పనులను నగరంలోని పలు డివిజన్లకు చెందిన ప్రజలు సోమవారం పరిశీలించారు. ఆయా డివిజన్లలోని సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో గిలకలదిండిలోని పాత ఫిషింగ్ హార్బర్ వద్ద నుంచి బోటులో సముద్రమొగ వద్దకు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. కొండరాళ్లతో సముద్రంలోకి దక్షిణ, ఉత్తరం ప్రాంతాల్లో నిర్మిస్తున్న గోడలను, హార్బర్ పనులను పరిశీలించారు. 5, 44 డివిజన్లకు చెందిన ప్రజలతో పాటు వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జిలు మామిడిబత్తుల అజయ్, వేముల వనబాబు, సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు పనులను పరిశీలించారు.

విద్యార్థుల వికాసానికి వేసవి శిక్షణ దోహదం

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ ప్రారంభం



వందేమాతరం ఆలపిస్తున్న చిన్నారులు



పెదపారుపూడి గ్రంథాలయంలో విద్యార్థులు



మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశ్వరరావు



గుడ్లవల్లేరులో ఆటల పోటీల్లో విద్యార్థులు



ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులు

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సెలవు దినాల్లో కాలం వృథా చేయకుండా ఈ విధమైన పరిజ్ఞానంతో కూడిన శిక్షణ విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌టీ ప్రసాదు, అవిర్నేని వెంకటేశ్వరరావు, గ్రంథాలయ ఉద్యోగులు టి. ప్రవల్లిక, వి.సునీత తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ: వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుకోవటానికి ఎంతగానో ఉపయోగపడతాయని మొవ్వ గ్రంథాలయ అధికారి టి.కృష్ణ కుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక గ్రంథాలయంలో 35 మంది విద్యార్థులకు పంచతంత్ర కథలు, క్విజ్, స్పెలింగ్ టెస్ట్, కబడ్డీ పోటీలను నిర్వహించారు.

మండవల్లి: మండవల్లి గ్రేడ్–3 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభమైంది. శిబిరాన్ని స్థానిక స్టేషన్‌మాస్టర్ ఎం.శ్రీనివాస్ రాజీవ్ ప్రారంభించారు. 36 మంది పిల్లలకు తక్కువ సమయంలో రీజనింగ్ విధానం ప్రాక్టీస్ చేయించారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన మాట్లాడుతూ పిల్లలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు చేకూరుతుందని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. సోమవారం నుంచి అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇచ్చిన వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకునేందుకు విజ్ఞాన సముపార్జనే ధ్యేయంగా ప్రభుత్వం ఈ శిబిరాలను జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారులు తెలిపారు. ఈ శిబిరాల్లో ఆటల పోటీలు, కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి కథలు, చిత్ర లేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాలను చేపట్టారు.

పామర్రు(తోట్లవల్లూరు): వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో జీ వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఎంఈవో మాట్లాడుతూ చిన్నారులకు పుస్తకాలే మంచి మిత్రులని, సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆటడం తగ్గించడం మంచిదన్నారు. ఇంగ్లిషు, గణితంలో ప్రత్యేక శిక్షణను ఇస్తారని అన్నారు. గ్రంథాలయ అధికారి బి.సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎంవి. లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు జ్ఞాపక శక్తి పెంచే శతక పద్యాలు, కథలు చెప్పామన్నారు. వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. శిబిరంలో పాల్గొనే విద్యార్థుల కోసం స్థానిక వైద్యుడు డాక్టర్ అంబుల మనోజ్, కుమార్తె వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి విద్యార్థులు ఆడుకునేందుకు పలురకాల క్రీడాపరికరాలను అందజేశారు. గ్రంథాలయాధికారిణి ఎస్ శ్రీదేవి పాల్గొన్నారు.

కైకలూరు: విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు సేవలు అందిస్తున్నాయని కై కలూరు, కలిదిండి మహిళా సర్పంచ్‌లు దానం మేరీ నవరత్నకుమారి, మసిముక్కు మారుతీప్రసన్న చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరాలను సోమవారం ప్రారంభించారు. కలిదిండిలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. కైకలూరు, కలిదిండి గ్రంథాలయాధికారులు ఆర్.రాఘవులు, జె.రమేష్‌బాబు, సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ, హైకోర్టు న్యాయవాది రుద్రపాక రత్నారావు, అధ్యాపకులు మహమ్మద్ జఖాఉల్లా, దానం ప్రసాద్, కలిదిండి–2 ఎంపీటీసీ సభ్యుడు నీలి సుమన్, సాహితి మిత్రుల అధ్యక్షులు ఎల్ఆర్ పోలిశెట్టి, ఎం.వెంకటేశ్వరరావు, చెక్క జగన్‌మోహనరావు, కల్యాణి పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరంలో శ్రీసాంబశివుని ఆలయ నిర్మాణ పనులకు 10వ తేదీన శ్రీకారం చుట్టనున్నట్లు ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూజాది కార్యక్రమాలు, విగ్రహాలు బాలాలయ ప్రవేశం, పురాతన శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ సాంబసదాశివ స్వామివారి ఆలయ నిర్మాణ పనులను పుల్లేటికుర్తి భోగేశ్వరశర్మ యాజ్ఞీకత్వంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సిఫారసు మేరకు దేవదాయశాఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.52 లక్షల 33 వేలు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు అవ్వాశ్రీ గుడిపాటి, బొడ్డుపాటి వంశీకుల మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ రూ.27 లక్షల 67 వేలు చెల్లించగా రూ.80 లక్షలతో పనులు చేయనున్నట్లు ఈఓ తెలిపారు.

రూ.9.60 లక్షలతో చెరువు అభివృద్ధి

మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామంలో చెరువు అభివృద్ధి పనులు సోమవారం ఉపాధి కూలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ రూ.9 లక్షల 60 వేల నిధులతో చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. 195 మంది కూలీలు సోమవారం పనులు చేసినట్లు చెప్పారు. ఈ పనుల ద్వారా కూలీలకు ఉపాధి లభించటమే కాక, రైతుల తాగునీటి సమస్యలు పరిష్కారమౌతున్నాయని తెలిపారు. పశువులకు తాగునీటి కొరత తీరుతుందని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

మంచి మిత్రుడిని కోల్పోయా

రామ్‌దాస్‌రెడ్డి సంస్మరణ సభలో ఎమ్మెల్యే కొడాలి నాని



రామ్‌దాస్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్(నందివాడ): ప్రముఖ పారిశ్రామికవేత్త, తనకు ఆప్తుడు మలిరెడ్డి రామ్‌దాస్ రెడ్డి (చిన బాబు) మృతి తనకు తీరని లోటని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. నందివాడ మండలం జనార్ధనపురం గ్రామంలో సోమవారం రామ్‌దాస్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కొడాలి నాని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి వ్యక్తి, మృదుస్వభావి, అందరికి సహాయకారిగా ఉండే రామ్‌దాస్‌రెడ్డి మృతి కుటుంబానికి, గ్రామ ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు ఓదార్పు కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. పేలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్‌రెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్, ఎంవీఎస్ నాగిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎర్నేని నాగేంద్రనాథ్ (చిట్టిబాబు), వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, ఎం.కృష్ణారెడ్డి, గొర్ల శ్రీను, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.కుమార్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి నివాళులు అర్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరాలని ఇంటింటి ప్రచారం

కైకలూరు: విద్యార్థులకు ప్రభుత్వ విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు, పీహెచ్‌డీలు పూర్తి చేసిన సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపకులు, స్వచ్ఛమైన నీటిని అందించే ఆర్వో ఫిల్టర్, శారీరక దారుఢ్యానికి జిమ్, సేవా స్ఫూర్తిని పెంపొందించే ఎన్ఎస్ఎస్ తర్ఫీదు, మహిళా సాధికారిత క్లబ్స్, ఇంగ్లిష్ బోధన ఇలా అన్ని వసతులు కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు పెద్ద సంఖ్యలో కాలేజీలో చేరాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డి సోమవారం కోరారు. కాలేజీలో ఆయన మాట్లాడుతూ 2023–2024 ఏడాదికి కాలేజీలో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. బీఏలో 60, బీకాం (జనరల్)–40, బీకాం (కంప్యూటర్ సైన్స్)–40, బీఎస్సీ (ఎంపీసీ)–40, బీజెడ్‌సీ–40, ఎంపీసీఎస్–30, ఏజెడ్‌సీ–30, డేటాసైన్స్–30 వంతున సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల వద్దకు అధ్యాపకులు వెళ్లి అడ్మిషన్లపై ప్రచారం చేస్తున్నారు. అడ్మిషన్ల కోసం 94402 19679, 92472 03460 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు సాధించాం



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం నర్సమాంబ

గుడివాడ టౌన్: పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమష్టి కృషితోనే మంచి ఫలితాలు సాధించామని ఏజీకే మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పీఎల్ నర్సమాంబ అన్నారు. సోమవారం స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. వరుసగా రెండో పర్యాయం టౌన్ ఫస్ట్ సాధించడంతో పాటు 500 మార్కులకు పైబడి 15 మంది విద్యార్థులు సాధించిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 86 శాతం ఉత్తీర్ణతతో పాటు 579 మార్కులు సాధించి విద్యార్థిని కె.అక్షయ టౌన్ టాపర్‌గా నిలవడం అభినందనీయమన్నారు. ఇందుకు కృషిచేసిన ఉపాధ్యాయులకు, శ్రద్ధతో చదివిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఏస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రగతి నమోదుచేశారన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు చెయ్యకుండా ఐఐటీ వరకు చదవగల అవకాశం కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుబాటులో ఉందని ఈ విషయాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు గ్రహించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు మొగ్గు చూపాలన్నారు.

కొల్లేరు ప్రజలకు ప్రభుత్వం అండ



శృంగవరప్పాడులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న గ్రామస్తులు

కైకలూరు: కొల్లేరు గ్రామాల ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు చేపట్టిన జయమంగళను శృంగవరప్పాడు గ్రామంలో సర్పంచ్ ఘంటసాల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రగా వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు ప్రజల సమస్యలను ఆలకించారన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ ధరను రూ.1.50కు అందించారన్నారు. కొల్లేరు ప్రాంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తానన్న హామీ నిలబెట్టుకున్నారన్నారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో నియోజకవర్గంలోని కైకలూరు, మండవల్లి మండలాల్లో అదనంగా ధ్వంసం చేసిన 7,500 ఎకరాల చెరువులను తిరిగి పేద ప్రజలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కొల్లేరు ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ముంగర నరసింహారావు, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఘంటసాల నాగమణి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, నాయకులు ఘంటసాల జగన్నాథం, సయ్యపురాజు గుర్రాజు, ఊడిముడి పెద్దిరాజు, జయమంగళ కాసులు, కొల్లేరు పెద్దలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు పనుల పరిశీలన



కైకలూరు: ప్రజలందరికీ ఉపయోగపడే గ్రామ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో నిర్మితమవుతున్న ఆటపాక గ్రామ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు తలారి జాన్, పోతన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): ఇళ్ల నిర్మాణ పనులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని వెంట్రప్రగడ సచివాలయం వద్ద సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల వద్ద వలంటీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ కలిసి హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల పనులు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. మెటీరియల్ తీసుకున్నా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. మండలంలోని పెదపాలపర్రు జగనన్న కాలనీలో లబ్ధిదారులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించి, నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను వెంటనే పూర్తిచేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని కోరారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువెళుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, తదితరులు

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం జరిగిన అన్నసమారాధనతో ముగిశాయి. ఈ సమారాధనలో స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ముఖ్య అతిథిగా హాజరై అన్నసమారాధనను ప్రారంభించారు. తొలుత ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ మత్రివాడ సుబ్బలక్ష్మి, పాలకవర్గ సభ్యులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకగా ఎమ్మెల్యే స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి సుభద్రబలరామకృష్ణులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమారాధనలో పాల్గొనడంతో పాటు స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి 4 వేల మందికి పైగా భక్తులు సమారాధనకు హాజరైనట్లు ఈవో, చైర్మన్ తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు శీలం రామకృష్ణ, మత్రివాడ వీరారెడ్డి, కోమటి విష్ణువర్ధన్, మరీదు నాగయ్య, జంపాన కోటయ్య, మరీదు రాధా, మత్రివాడ వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సాక్షి సాయిబాబు, కొల్లి నాని, మీసాల రామకృష్ణ ముత్యాల రాంబాబు, దివి సతీష్, పేర్ని పృథ్వీ, ఎస్సై షణ్ముఖసాయి, తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

చినముత్తేవి(మొవ్వ): పుట్టబోయే బిడ్డ నుంచి అవ్వ తాతల వరకు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే చెందుతుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలోని కోలంటివాని గూడెంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం శంకుస్థాపన చేశారు. శిలా ఫలకం ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రోడ్లను సుమారు రూ.50 లక్షలతో నిర్మించనున్నామని, వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామంలో ప్రధానంగా ఉన్న ఇళ్ల స్థలాల కొరతకు కూడా త్వరలో తెరపడబోతుందని, అనుకూలంగా ఓ స్థలాన్ని చూసి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీడీపీవో పి.భానుమతి మాట్లాడుతూ రూ.13.5 లక్షలతో భవన నిర్మాణ పనులు చేయనున్నామని, మరో రూ.2.5 లక్షలతో ప్లే, ఇన్‌డోర్, అవుడ్ డోర్ మెటీరియల్స్ సమకూర్చనున్నట్లు తెలిపారు. ఎంపీపీ కొండేటి ఇందిర, ఎంపీటీసీ గారపాటి రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొమ్ము సొధామణి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, పార్టీ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలరించిన వేమన పద్య పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుచున్న జాతీయస్థాయి నాటిక పోటీల్లో భాగంగా సోమవారం వేమన పద్యపోటీలు నిర్వహించారు. 15 సంవత్సరాల లోపు బాలబాలికలకు, ఛాత్రోపాధ్యాయులకు విడివిడిగా ఈ పోటీలు జరిగాయి. బాలబాలికల విభాగంలో ఎస్.రేకాంత్ ప్రథమ (రూ.2,000), పీఎల్ఎస్ ప్రణవి ద్వితీయ (రూ.1,500), పి. సూర్యశశాంక్ తృతీయ (రూ.1,000), చాత్రోపాధ్యాయ విభాగంలో బి.సిరిగ్రేసి ప్రథమ (రూ.2,000), ఆర్.గంగాభవాని ద్వితీయ (రూ 1,000) బహుమతులు సాధించారు. న్యాయ నిర్ణేతలుగా డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎంవీజే ఆంజనేయులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు వి.రాఘవాచారి, డొక్కు నాగేశ్వరరావు, మేకా మాధవరావు వ్యవహరించారు.

'పది'లో ఉత్తమ విద్యార్థినికి అభినందన

కైకలూరు: పది పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితం సాధించిన కొండపల్లి శరవణ యశస్వినిని కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి సోమవారం అభినందించారు. కై కలూరు సచివాలయం–1లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మాధురి కుమార్తె యశస్విని ఈ ఘనత సాధించింది. దానం ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రవికుమార్



పామర్రు: ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కు డైరెక్టర్‌గా నాగదేశి రవి కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జీ జయలక్ష్మి నుంచి సోమవారం ఆదేశాలు వచ్చాయి. పామర్రు నియోజకవర్గం పెదపారుపూడి మండలం నాగాపురం గ్రామానికి చెందిన రవికుమార్ పార్టీ పెట్టిన నాటి నుంచి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. రవి సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ అవకాశం కల్పించారు. రవికుమార్ మాట్లాడుతూ పార్టీలో కష్ట పడిన వారికి సీఎంజగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం ఇస్తారని పేర్కొన్నారు. మాలసామాజిక వర్గాన్ని అంతటిని ఒక్క తాటిపైకి తీసుకు వచ్చి వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.